క్లుప్తంగా

ఓపెన్ అడ్మిషన్ల గడువు పెంపు

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు కోఆర్డినేటర్ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్ పాసైన వారు, ఐటీఐ రెండేళ్ల కోర్సు పాసైన వారు, డిప్లొమా పాసైన వారు డిగ్రీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు స్వయంగా యూనివర్సిటీ పోర్టల్ www. braouonline.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ద్వితీయ, తృతీయ ఏడాది విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఈనెల 31వ తేదీ తుదిగడువని తెలిపారు. ఇతర వివరాలకు 9515401088 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎంపీడీఓకు సత్కారం



శ్రీదేవిని సన్మానిస్తున్న పట్టాభిరెడ్డి

గంగాధరనెల్లూరు: విధి నిర్వహణలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించే అధికారులకు గుర్తింపు లభిస్తుందని ఆర్టీఐ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి అన్నారు. ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న ఎంపీడీఓ శ్రీదేవికి శుక్రవారం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. సేవా దృక్పథంతో పనిచేసే అధికారులను అవార్డులు వరిస్తాయని చెప్పారు. ఆర్టీఐ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డీకే కుమార్, జిల్లా అధ్యక్షుడు పాచిగుంట రామరాజులు, రాజేష్‌కుమార్, లోకనాథనాయుడు, దేవదాసు, సురేఖ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నగరి : విద్యుత్ సబ్‌స్టేషన్ల సర్వీసులో భాగంగా శనివారం నగరి, నెత్తంకండ్రిగ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.


సారా విక్రేత అరెస్టు



నిందితురాలి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ సిబ్బంది

నగరి : మండలంలోని ఓజీ కుప్పంలో సారా విక్రయిస్తున్న పి.మునిలక్ష్మి (60)ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి శుక్రవారం అరెస్టు చేశారు. రహస్య సమాచారం మేరకు సారా విక్రయాలపై గ్రామంలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఆ సమయంలో సారా విక్రయిస్తున్న మునిలక్ష్మిని అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. దీంతో ఆమె చిత్తూరు జైలుకు తరలించారు. తనిఖీల్లో ఎస్‌ఐ భానుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ బాలముని, మోహన్‌రెడ్డి, పీసీలు హిదయతుల్లా, కృష్ణవేణి, గురవయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఐగా రమేష్‌బాబు బాధ్యతల స్వీకరణ



వెదురుకుప్పం: మండల ఎస్‌ఐగా రమేష్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు కృషి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. అందరూ సహకరించాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బుచ్చినాయుడుకండ్రిగ: కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను వీఆర్‌ఓ భాస్కర్ శుక్రవారం పట్టుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కాళంగి నదిలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. తహసీల్దార్ భార్గవి మాట్లాడుతూ కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. రెండు సార్లు పట్టుబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

–వ్యక్తికి జైలుశిక్ష



బాలసుబ్రమణ్యంను అరెస్టు చేసిన పోలీసులు

సత్యవేడు: స్థానిక శ్రీకాళహస్తి బస్టాండులో పెద్ద ఈటిపాకం గ్రామానికి చెందిన మహిళ కుటుంబ సభ్యులతో కలసి బస్సు కోసం వేచి ఉండగా, సత్యవేడు బీసీ కాలనీకి చెందిన బాలసుబ్రమణ్యం అసభ్యంగా ప్రవర్తించారని సదరు మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డి కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేశారు. శుక్రవారం నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండుకు పంపారని ఎస్‌ఐ తెలిపారు.

అన్ని వర్గాలు మెచ్చేలా జగనన్న పాలన

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): అన్ని వర్గాలు మెచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శుక్రవారం సాతంబాకం సచివాలయ పరిధిలోని పెద్దరాసపల్లె, చిన్నరాసపల్లె, తోకలచేను, కృష్ణాపురం, రామాపురం, రామాపురం దళితవాడ, బీలిజపల్లె, సాతంబాకం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు స్థానికులు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. నారాయణస్వామి ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా ఉందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సీఎం జగనన్న అమలు పేదల కోసం అనేక పథకాలు అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. నవరత్నాల పథకాల్లో అర్హులైన వారికి పింఛన్లు, జగనన్న తోడు, అమ్మ ఒడి, జగనన్న కాలనీలు, జగనన్న విద్యాదీవెన వంటి అనేక పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. రామాపురం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు చూశామని.. కానీ ఇలాంటి సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వాన్ని ఇదే మొదటిసారి చూడడం అన్నారు. ప్రతి సామాజిక వర్గానికి సంక్షేమాలు అందిస్తున్న ఈ ప్రభుత్వం ఉండడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. రామాపురం దళితవాడలో వనజ మాట్లాడుతూ.. దళితవాడలో పిల్లలకు వివాహాలు అయ్యి రెండు మూడు కుటుంబాలు ఒకే ఇంటిలో ఉంటున్నారని, వారికి ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేసి నిర్మాణాలు చేయించాలని ఆదేశించారు. అలాగే అదే గ్రామానికి చెందిన హారిక మాట్లాడుతూ.. విద్యుత్ తీగలు ఇళ్లపైనే వెళుతున్నాయని, ప్రమాదాలు చోటు చేసుకోక ముందే తొలగించాలని మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఇళ్లపై వెళుతున్న లైన్లను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్లు లేని గ్రామాలకు సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే జగన్నాథరెడ్డి మాట్లాడుతూ.. 'నేను 2004 నుంచి కాంగ్రెస్, టీడీపీలో పని చేశా.. అయితే ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన నాయకుడ్ని జగనన్నను మాత్రమే చూస్తున్నాను' అని అన్నారు. అలాంటి ప్రభుత్వానికి ప్రజలు రుణపడి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళావతి, ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణారెడ్డి, యువత అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జమున, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మీన, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీపతి, దూది మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ నారాయణస్వామికి గజమాలలతో స్వాగతం పలుకుతున్న రామాపురం గ్రామస్తులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

పుత్తూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పుత్తూరు ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాట్లాడుతూ తమ కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుంచి కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న తమ సర్వీసును గత ప్రభుత్వం క్రమబద్ధీకరించలేదని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తూ దస్త్రంపై సంతకం చేయడం ద్వారా తమ జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. రాష్ట్ర కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ పాలిటెక్నిక్ లెక్చరర్స్ అందరి తరపున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు తంబయ్య, మునస్వామి, రాజేంద్రప్రసాద్, జయప్రసాద్, ప్రసాద్, రవి, కవిరసు, మాలతి, మధు, రాజి, సుధ, సుధారాణి, కేశవరెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో స.హ.చట్టం కమిషనర్



స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేష్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర సమాచారహక్కు చట్టం కమిషనర్ కట్టు జనార్దన్‌రావు దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా శుక్రవారం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేష్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వాదం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, జెడ్పీసీ ఈఓ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటు స్థాయిలో సర్కార్ బడులు



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నాడు–నేడుతో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నట్లు ఎంపీపీ నాగరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని జక్కదొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పాఠశాలలో నాడు–నేడు రెండో విడతలో భాగంగా నాలుగు అదనపు తరగతుల నిర్మాణానికి రూ.40 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ పేదల విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. తరగతి గదులను సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురగయ్య, ప్రధానోపాధ్యాయులు చంద్రముని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

- ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- సుమంగళి పూజలు నిర్వహించిన మహిళలు



గెరిగ ఊరేగింపు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడుగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారికి అభిషేకం చేశారు. 7 గంటలకు గోపూజ, శ్రీకృష్ణుడికి పాలాభిషేకం జరిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హరికథా గానం జరిగింది. సాయంత్రం 6 గంటలకు పురోహితుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సుమంగళి వ్రతం, కుంకుమార్చన, జ్యోతిపూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

రాత్రి 9 గంటలకు రేణుకమ్మ, నాగరాజయాదవ్ ఆధ్వర్యంలో ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 10 గంటలకు పట్టణానికి చెందిన శ్రీబాలాజీ వీధి నాట్య కళా బృందం ప్రదర్శించిన శశిరేఖ పరిణయం నాటకం అలరించింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, సభ్యులు ముకుంద ప్రకాష్, సెల్వరాజ్ పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ నిర్వాహకులు సాల్వాకం ఏలుమలైమొదలి, పళణిమొదలి, గోపిమొదలి, పెరుమాళ్‌మొదలి, కుప్పుస్వామిమొదలి పర్యవేక్షించారు.



సుమంగళి వ్రతంలో పాల్గొన్న మహిళలు

డిసెంబర్‌కు పనులు పూర్తికావాల్సిందే!

–డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: నగరంలో చేపట్టిన మొదటి దశ పనులు సెప్టెంబర్ నాటికి, రెండో దశ పనులు డిసెంబర్ కల్లా పూర్తి చేయాల్సిందేనని నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 35వ డివిజన్ భవానినగర్–టీటీడీ ఏడీ బిల్డింగ్ రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం ఆయన ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి రూ.80 కోట్ల వ్యయంతో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన పనులు చేపట్టామన్నారు. నగరంలోని 50 డివిజన్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. పనులన్నీ సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు. డిసెంబర్ నాటికి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో రాజీపడేదేలేదని చెప్పారు. మున్సిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, డీఈ గోమతి, 35వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు దినేష్ రాయల్, నేతలు చందు, మూలం అశోక్, రాఘవులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన మునిరెడ్డి, లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సొమ్మును టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు స్వీకరించారు. దాతకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారుల క్లబ్బులను ఏర్పాటు చేయండి

తిరుపతి ఎడ్యుకేషన్: వినియోగదారుల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, దీని కోసం పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఉన్నత పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్బులను ఏర్పాటు చేయాలని తిరుపతి డీవైఈఓ ఆనందరెడ్డి తెలిపారు. జిల్లా ఆహార, పౌర సరఫరాల శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సోషియల్ టీచర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీచర్ మెంటార్‌లు నీలకంఠ, హరిశంకర్, రిసోర్స్ పర్సన్లు ప్రభ, సుబ్రమణ్యం, లక్ష్మయ్య నాయుడు, రమేష్ బాబు, బాలాజీ, వాసయ్య పాల్గొన్నారు.

నేడు ప్రసూతి వైద్య సిబ్బందితో సమావేశం

చిత్తూరు రూరల్: ఇటీవల జరుగుతున్న ఘటనలపై చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి, చిన్న పిల్లల విభాగాల్లో పనిచేసే డాక్టర్లు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు డీసీహెచ్‌ఎస్ బీఏ స్కే నాయక్ తెలిపారు. ప్రసూతి విభాగంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి విధిగా ఆ విభాగంలోని డాక్టర్లు, సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

నేడు ప్రకృతి ఆహారంపై అవగాహన సదస్సు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రకృతి ఆహారంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ప్రకృతి వనం ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. నేటి సమాజంలోని మానవుడు ఏ ఆహారం ఏ సమయంలో, ఎంత తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందనే అంశంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం



ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చేనేత సంఘం ఆధ్వర్యంలో ధ్వజారోహణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలతో విశేష పూజలు చేశారు. ముందుగా పుర వీధుల్లో పోతురాజును ఊరేగించి పూజలు చేశారు. శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, చేనేత సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే దోమల కట్టడి సాధ్యం



వీరభద్రకాలనీలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: పరిశుభ్రతతోనే దోమల కట్టడి సాధ్యమని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరం వీరభద్రకాలనీలోని శుక్రవారం ఆమె పర్యటించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. కాలనీలోని పలు ఇళ్లను తనిఖీ చేసి కాలనీవాసులకు పలు సూచనలు చేశారు. ఇంటి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పీరు సాహెబ్, లలిత్, మనోహర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు దిక్సూచి తరతరాల తిరుమల



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: తరతరాల తిరుమల చరిత్ర పుస్తకం భావితరాలకు ఒక దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు. స్థానిక పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం సీనియర్ జర్నలిస్టు కుమార మంగళం నేతాజి రచించిన తరతరాల తిరుమల పుస్తకాన్ని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు





మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, మామిడి చెట్లలో కొమ్మ కత్తిరింపును తెలియజేస్తున్న అధికారులు

- మామిడి కొమ్మల కత్తిరింపు తప్పనిసరి
- జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళెం: మామిడి సాగులో పంట కోత అనంతరం చేపట్టే యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కరిడివారిపల్లెలో రైతు వేణుగోపాల్‌రెడ్డి మామిడి తోట ఆవరణలో శుక్రవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి పంట కోత అనంతరం యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రెడ్డిరామ్ మాట్లాడుతూ, మామిడి తోటల్లో పంట కోత తరువాత చెట్ల కొమ్మల కత్తిరింపు తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. తోటల్లో జనుము, జీలుగ, పిల్లపిసర లాంటి పచ్చిరొట్టను ఇచ్చే పంటలను పెంచి కలియ దున్నాలన్నారు. 10 సంవత్సరాల మామిడి చెట్టుకు సుమారు 100 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల యూరియా, 5 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను చెట్టు మొదలు నుంచి 4 అడుగుల దూరంలో 30–45 సెంటీ మీటర్ల గాడి తీసి వేయాలని సూచించారు. మామిడి తోటను వాలుకు అడ్డంగా రెండు సార్లు దున్నాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ, ఉద్యానశాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించి మామిడి పంటను లాభసాటిగా చేసుకోవాలన్నారు. ఉద్యానశాఖ అధికారి లక్ష్మీప్రసూన మాట్లాడుతూ, ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.